ఖమ్మంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సభలో అభివాదం చేస్తున్న కేటీఆర్, ప్రవీణ్‌కుమార్, ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా,

కొత్తగూడెంలో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చీటర్ కావాలా? రైతు బిడ్డ కావాలా?

- ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని గెలిపించి మండలికి పంపండి..
- నోటిఫికేషన్, ఇంటర్వ్యూలు లేకుండా రేవంత్ 30 వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారు?
- నిజం గడపదాటేలోపు అబద్ధం ఊరు చుట్టినట్లయింది
- జాబ్ క్యాలెండర్ ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఖమ్మం ఎస్‌బీఐటీలో జరిగిన పట్టభద్రుల సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

ఖమ్మం, మే 20 : నిత్యం బూతులు మాట్లాడుతూ చీటింగ్ చేసి జైలు జీవితం గడిపిన కాంగ్రెస్ అభ్యర్థి కావాలా? రైతు కుటుంబంలో పుట్టి బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ చేసి అమెరికాలో ఉద్యోగం వదిలేసి పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు రాజకీయాల్లోకి వచ్చి కేసీఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రాకేశ్‌రెడ్డి కావాలో పట్టభద్రులు, నిరుద్యోగులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల ఆవరణలో నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజవకవర్గ విస్తృతస్థాయి సమావేశం బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ ఇంఛార్జ్ ఆర్జేసీ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నపై 56 కేసులు ఉన్నాయని, 74 రోజులు చర్లపల్లి జైలులో ఉన్న వ్యక్తికి ఓటు వేస్తే పట్టభద్రులకు ఎలాంటి ఉపయోగం జరగదన్నారు. ఉన్నత చదువులు చదివి కేసీఆర్ పాలన మెచ్చి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రాకేశ్‌రెడ్డికి ఓటు వేయడం వల్ల ప్రజా సమస్యల పట్ల నిత్యం స్పందిస్తూ ప్రజా గొంతుకగా నిలుస్తారని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు అబద్ధాలను కొంత నమ్మారని, నిజం గడప దాటేలోపు అబద్ధం అంతా చుట్టినట్లైందన్నారు. కేసీఆర్ పాలనలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తే.. ఇది చెప్పుకునేలోపు కాంగ్రెస్ సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రచారాన్ని ప్రజలు నమ్మారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వం ఉంటే రాహుల్‌గాంధీ, మోడీలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారని, కానీ.. ఇంతవరకు ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఒక్క నోటిఫికేషన్, ఇంటర్వ్యూ లేకుండా 30 వేల ఉద్యోగాలు రేవంత్‌రెడ్డి ఎలా ఇచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. రూ.400 ఉన్న టెట్ ఫీజు రూ.2 వేలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం బయ్యారంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పలేదని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. ఖమ్మంలో అజయ్‌కుమార్ అధ్వర్యంలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని, అయితే ప్రతిపక్షాలు వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే కుట్ర చేశాయని అన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్రంలో ఐటీ ఉత్పత్తులు 57 వేల కోట్ల విలువ ఉంటే.. తొమ్మిదేళ్లలో వాటి విలువ 2 లక్షల 41 వేల కోట్లకు పెంచామని గుర్తు చేశారు. అనేక పరిశ్రమలు తీసుకొచ్చామని, 10 లక్షల మందికి ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు వచ్చాయని కేటీఆర్ అన్నారు. పట్టభద్రులు ప్రతి ఒక్కరూ వచ్చే జనరేషన్‌ను దృష్టిలో ఉంచుకొని రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

'గ్యారెంటీ'కి గౌరవం లేకుండా పోయింది.. –బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల వల్ల గ్యారెంటీ అనే పదానికి గౌరవం లేకుండా పోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. నిజానికి, అబద్ధానికి మధ్య యుద్ధం జరుగుతున్నదని, కేసీఆర్ నిలబెట్టిన అభ్యర్థి రాకేశ్‌రెడ్డి నిజం, ఆశయం, త్యాగానికి ప్రతిరూపమన్నారు. విద్య విలువ తెలిసిన రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపినిచ్చారు. కేసీఆర్ పదేండ్ల పాలన నిప్పులాంటి నిజమైన పాలన అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలకు నాణ్యమైన విద్యను గురుకులాల ద్వారా అందించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. తాను గురుకుల కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆడపిల్లలు మధ్యలోనే చదువు మానేస్తున్నారని ఒక్కమాట చెప్పగానే 36 డిగ్రీ మహిళా కళాశాలలను ప్రారంభించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. ఇటీవల భవనగిరి, సూర్యాపేట జిల్లాలో గురుకుల విద్యార్థులు చనిపోయారని, అనేక మంది అస్వస్థతకు గురయ్యారని, అయినా సంక్షేమ శాఖ, హోంశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కనీసం స్పందించలేదన్నారు. 34 మంది ఎమ్మెల్యేలు ఉంటే కేసీఆర్ ఏమి చేస్తారోనని భయం వద్దని, పాండవులు ఐదుగురే ఉన్నారని, అయినా విజయం సాధించారని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపాలి.. – బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి కోరారు. పెద్దల సభకు మేధావులను పంపాలి తప్ప మోసగాళ్లను పంపొద్దన్నారు. ప్రతి ఒక్కరు గల్లా ఎగురేసుకొని చెప్పుకునే అభ్యర్థిని మాత్రమే ఎన్నుకోవాలన్నారు. తనను గెలిపిస్తే ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన వారి గొంతుకలా పోరాడతానని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి – మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

జిల్లా ఓటర్లు, ప్రజలు చాలా చైతన్యవంతులని, పట్టభద్రుల నియోజకవర్గంలోని ఓటర్లు అందరూ విజ్ఞతతో ఆలోచించి ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని ఎన్నుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న ఒక బ్లాక్ మెయిలర్ అని, అతడికి ఓటు వేయడం వ్యర్థమన్నారు.

సమావేశంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, కొండబాల కోటేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు బచ్చు విజయ్‌కుమార్, కూరాకుల నాగభూషణం, సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, నాయకులు బిచ్చాల తిరుమలరావు, వీరునాయక్, బొమ్మెర రామ్మూర్తి, కార్పొరేటర్లు, గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు.

మళ్లీ మోసపోవద్దు.. గోసపడతాం..

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం బలమైన శక్తిగా ఉండాలి

హామీలు అమలు చేయని అబద్ధాల కాంగ్రెస్‌ను నమ్మొద్దు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని ఆదరించండి

'గూడెం' ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'కేటీపీఎస్' తిరుగుబాటు.. స్వరాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి: రాకేశ్‌రెడ్డి

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు రేగా, వనమా, మెచ్చా, హరిప్రియ

భద్రాద్రి కొత్తగూడెం, మే 20 (నమస్తే తెలంగాణ) : అబద్ధాల కాంగ్రెస్‌ను మరోసారి నమ్మితే మళ్లీ మోసపోయి గోసపడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. హామీలు అమలుచేయని కాంగ్రెస్‌ను ఇంకెప్పుడూ నమ్మవద్దని అన్నారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ప్రతిపక్షం ఎప్పుడూ బలమైన శక్తిగా ఉండాలని అన్నారు. అందుకోసం ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల గళం వినిపించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపుతోందని ఆరోపించారు. మరోసారి ఆ పార్టీని నమ్మితే ఇక్కడి సింగరేణిని కూడా ప్రైవేటీకరణ చేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. అసలేమీ ఇవ్వకుండా రైతుల నోట్లో మట్టికొట్టారని దుయ్యబట్టారు. రూ.15 వేల రైతుభరోసా ఇస్తానని చెప్పిన ఆ ముఖ్యమంత్రి.. నాట్లు వేశాక కూడా పంటల సాయం ఇవ్వలేదని దుమ్మెత్తిపోశారు. చివరికి ఓట్లు వేశాక ఇస్తానంటూ కబుర్లుచెబుతున్నారని విమర్శించారు. ఇలాంటి అబద్ధాల కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో పట్టుభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

గత కేసీఆర్ ప్రభుత్వంలో అద్భుత అభివృద్ధి..

తెలంగాణను సాధించిన కేసీఆర్.. తన పాలనలో స్వరాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. ఇంతటి అభివృద్ధి దేశంలోని మరే రాష్ట్రంలోనూ జరగలేదని స్పష్టంచేశారు. స్వాతంత్ర్యం రాకముందు తెలంగాణలో కేవలం మూడు మెడికల్ కాలేజీలు ఉంటే ఇప్పుడు 33 మెడికల్ కాలేజీలను, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి ప్రతి జిల్లాకూ నూతన కలెక్టరేట్ తెచ్చామని అన్నారు. 2014 నుంచి 2024 వరకు 2 లక్షలు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రమూ ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. ఇచ్చినట్లు రుజువు చేస్తే తాను రాజీనామాకు సిద్ధమని స్పష్టం చేశారు. పట్టభద్రులు మరోసారి ఆలోచించి విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకగా దీవించాలని కోరారు.

అతడు గోల్‌మాల్ మల్లన్న..

కాంగ్రెస్ తరపున పోటీ చేసే వ్యక్తి తీన్మార్ మల్లన్న కాదని.. గోల్‌మాల్ మల్లన్న అని విమర్శించారు. అతడిపై అనేక కేసులు ఉన్నాయని, యూట్యూబ్ చానల్ పెట్టుకుని పబ్బం గడుపుకుంటున్నాడని, జనం అతడిని నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు.

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, తెలంగాణ ఉద్యమకారుడు దండిగల రాజేందర్, భద్రాచలం ఇన్‌చార్జి మానె రామకృష్ణ, ఎంపీపీలు, సోనా, శాంతి, జడ్పీటీసీ వెంకటరెడ్డి, నాయకుడు వనమా రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన పట్టభద్రులు..

కొత్తగూడెంలో జరిగిన బీఆర్ఎస్ పట్టభద్రుల ఆత్మీయ సమావేశానికి జిల్లా నుంచి పట్టభద్రులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. 'జై తెలంగాణ' నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. కేటీఆర్‌తో ఫొటోలు సెల్ఫీలు దిగేందుకు పట్టభద్రులు పోటీపడ్డారు.

సభకు హాజరైన పట్టభద్రులు

మరోసారి పొరబడితే మన బతుకుల్లో చీకట్లే.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కొత్తగూడెం అర్బన్, మే 20: కొత్తగూడెం గ్రాడ్యుయేట్లు మరోసారి పొరబడరని తాను నమ్ముతున్నానని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. పొరపాటున పొరబడి మరోసారి కాంగ్రెస్‌ను నమ్మితే మన బతుకులన్నీ చీకటిమయమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగూడెం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్.. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ప్రతిపక్షం నుంచి ప్రశ్నించే గొంతుక శాసన మండలిలో ఉండాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలవాల్సిన అవసరం ఉందని అన్నారు. సాధారణ తరగతి కుటుంబంలో పుట్టిన రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలానీలో చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారని అన్నారు. అయినప్పటికీ మాతృభూమికి సేవ చేసేందుకు ఇక్కడికి వచ్చి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారని అన్నారు.

కేటీపీఎస్ తిరుగుబాటు.. స్వరాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి : రాకేశ్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్తగూడెం ప్రాంతం అగ్గిగుండం లాంటిదని గుర్తుచేశారు. పాల్వంచ కేటీపీఎస్‌లో జరిగిన తిరుగుబాటు.. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని అన్నారు. ఇక్కడి ప్రజలు అంతటి చైతన్యమంతులని అన్నారు. ఇలాంటి ప్రాంతంలోని ఇక్కడి పట్టభద్రులు తనకు అత్యధిక మెజార్టీ అందించి చరిత్రాత్మక తీర్పునివ్వాలని కోరారు.

పేదలకు రేషన్ కార్డులు, ఇళ్లు ఇస్తాం

ఎన్నికల కోడ్ ముగియగానే నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

పాలేరు ప్రజల ఆశీస్సులతోనే ఈ అవకాశం: మంత్రి పొంగులేటి

గువ్వలగూడెం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి (నేలకొండపల్లి) మే 20: పేదలందరికీ రేషన్ కార్డులు, ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే తనకు ఈ అవకాశం లభించిందని అన్నారు. అందుకే ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని అన్నారు. నేలకొండపల్లి మండలం గువ్వగూడెం, ముజ్జుగూడెం, అనాసాగరం, సదాశివపురం, పాత కొత్తూరు, నాచేపల్లి గ్రామాల్లోని ప్రజలతో సోమవారం నిర్వహించిన 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి కోడ్ ముగియగానే వాటిని పరిష్కరిస్తానని అన్నారు. ఈ సందర్భంగా గువ్వలగూడెంలో జరిగిన ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత తనదేనని అన్నారు. గృహనిర్మాణ శాఖ మంత్రిగా కూడా ఉన్నందున తనకు ఈ అవకాశాన్ని కల్పించిన పాలేరుకు ఎక్కువ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, శాఖమూరి రమేశ్, వెన్నెపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య, బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, రాయపుడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 20 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన శిక్షణా తరగతులను ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా సిబ్బందికి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. 26న రామచంద్ర ఆర్ట్స్ కాలేజీలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉంటుందని, 27న రిసెప్షన్ కూడా అక్కడే ఉంటుందని తెలిపారు. పార్లమెంట్, శాసనసభ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీ ప్రకారం నంబర్ ద్వారా ఓటు వేయాల్సి ఉంటుందని, పోలింగ్ స్టేషన్లలో ఇచ్చిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్ మాత్రమే వాడాల్సి ఉంటుందని, ఇంకా ఇతరత్రా పనులకు దీనిని వినియోగించొద్దన్నారు. ముఖ్యమైన నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉంటే నమ్మకంతో, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ట్రైనింగ్ నోడల్ అధికారి అలీం, పూసపాటి సాయికృష్ణ, కిరణ్‌కుమార్, పీవో, ఏపీవోలు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు మద్దతివ్వండి

- అబద్ధాల కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధిచెప్పండి
- విద్యావంతుడికీ, బ్లాక్ మెయిలర్‌కీ మధ్యనే ఈ పోటీ
- 2 లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత గత సీఎం కేసీఆర్‌దే..
- రేవంత్, మోదీ కలిసి సింగరేణిని ప్రైవేటుపరం చేస్తారు
- ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించండి
- ఇల్లెందు పట్టభద్రుల సమ్మేళనంలో మాజీ మంత్రి కేటీఆర్

ఇల్లెందులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి గజమాల వేస్తున్న నాయకులు

ఇల్లెందు, మే 20 : ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు మద్దతివ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. విద్యావంతుడికి, బ్లాక్ మెయిలర్‌కు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో విద్యావంతుడైన తమ పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అబద్ధాల కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఇల్లెందు సింగరేణి హైస్కూల్లో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థిపై 56 కేసులు ఉన్నాయని అన్నారు. అవి రాష్ట్రం కోసమో, దేశం కోసమో కొట్లాడితే నమోదైన కేసులు కావని స్పష్టం చేశారు. కేవలం బ్లాక్ మెయిలింగ్ చేసినందుకు, బెదిరింపులకు పాల్పడినందుకు, మహిళల గౌరవానికి భంగం కలిగించినందుకు నమోదైన కేసులని తేల్చి చెప్పారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఇంజినీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యావంతుడని అన్నారు. అమెరికాలో ఉద్యోగాన్ని సైతం వదలి తెలంగాణ ప్రజల కోసం వచ్చినవాడని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో బ్లాక్ మెయిలర్‌కు ఓటు వేయాలో, విద్యావంతుడికి ఓటు వేయాలో పట్టభద్రులు ఆలోచించాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ రంగంలో 2 లక్షల ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో సుమారు 24 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని, ఇంకా లక్షలాది మందికి ఉపాధి కల్పించామని గుర్తు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలు కల్పించిందని, ఎన్నికల కోడ్ రావడంతో నియామక పత్రాలు ఇవ్వలేదని అన్నారు. కానీ.. ఆ తరువాత గెలిచిన కాంగ్రెస్.. ఆ నియామక పత్రాలు అందించి ఆ ఉద్యోగాలన్నీ వారి ప్రభుత్వమే ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. గెలిచిన తర్వాత ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి.. పచ్చి అబద్ధాలతో పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియాలో జరిగిన విష ప్రచారంలో ప్రజలు వాస్తవాలను గమనించలేకపోయారని అన్నారు. సింగరేణిలో 24 వేల ఉద్యోగాలిచ్చి కేసీఆర్ ఆదుకుంటే.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాని మోదీ కలిసి సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

పుట్టినగడ్డ రుణం తీర్చుకుంటా: రాకేశ్‌రెడ్డి

నిరుద్యోగులతోపాటు యావత్ తెలంగాణ ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడి తాను పుట్టిన తెలంగాణ గడ్డ రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి అన్నారు. అమెరికాలో తన ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ప్రజల కోసమే వచ్చానని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వదించి మీ వద్దకు పంపారని అన్నారు. పట్టభద్రులందరూ ఆలోచించి తనను ఆదరించాలని కోరారు.

అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటేయాలి: సత్యవతి రాథోడ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటు వేయాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, హరిసింగ్‌నాయక్, రంగనాథ్, సిలివేరి సత్యనారాయణ, జేకే శ్రీను, గిన్నారపు రాజేశ్, మహేందర్, శీలం రమేశ్, వరప్రసాద్, అచ్చయ్య, లక్ష్మణ్‌నాయక్, తాతా గణేశ్, పరుచూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.